7

సాక్షి కుమురం భీం

సోమవారం । 1 । జనవరి । 2024



జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో వేడుకలు



నయా.. జోష్

కాలచక్రం గిర్రున తిరిగింది. మరో ఏడాది కనుమరుగైంది. మంచి, చెడులను జ్ఞాపకాలుగా మిగిల్చింది. జిల్లా వాసులు 2023కు ఘనంగా వీడ్కోలు పలికారు. నయా జోష్ మొదలైంది. కొత్త ఆశలు, ఆకాంక్షలు, ఆశయాలను మోసుకొని వచ్చిన 2024కు జిల్లా వాసులు ఘన స్వాగతం పలికారు. యువ ఆలోచనలు వెల్లివిరిసేలా.. అనుభవాల మార్గదర్శనలో.. నవశకానికి నాంది పలికేలా.. విజయ సోపానాలు వీడకుండా.. లక్ష్యాలను సాధించాలని కోరుకుంటూ హ్యాపీ న్యూ ఇయర్.

న్యూస్‌రీల్

దివ్యాంగులు అధైర్య పడొద్దు

కాగజ్‌నగర్‌టౌన్: దివ్యాంగులు చాలా మంది కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకున్నారని, ఎప్పుడూ అధైర్యపడకుండా ముందుకు సాగాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని బాలభారతి ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగ వైకల్యం మనిషి శరీరానికే కానీ మేధస్సుకు ఉండదన్నారు. పలువురు దివ్యాంగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఎండీ ఖయ్యూం, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ మజీద్, కోశాధికారి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు, పీడీ మధుసూదన్ తెలిపారు. ఆదివారం పాఠశాల ఆవరణలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఇటీవల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్- 17 జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. జనవరి 1 నుంచి 3 వరకు మహబూబ్‌నగర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి



ఆసిఫాబాద్: 2023లో జిల్లా ప్రజలు శాంతి భద్రతల పరిరక్షణకు ఎంతో సహకరించారు. కమ్యూనిటీ పోలీసింగ్, ఫ్రెండ్లీ పోలీసింగ్ విజయవంతంగా అమలు చేశాం. గతేడాది గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, వైద్య శిబిరాలు నిర్వహించాం. అసెంబ్లీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు మావోయిస్టుల కదలికలను కట్టడి చేశాం. నూతన సంవత్సరంలో జిల్లాలోని మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన దరఖాస్తుదారులకు సౌకర్యాలు కల్పించడంతోపాటు పూర్తి సమాచారం అందిస్తాం. రానున్న పార్లమెంట్ ఎన్నికలు కూడా సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు నిబద్ధతతో పని చేస్తాం.

– కె.సురేశ్‌కుమార్, ఎస్పీ

పెండింగ్ పనులు పూర్తి చేస్తాం



కౌటాల: 2023 సంవత్సరం గొప్ప అనుభూతిని మిగిల్చింది. ప్రజలు పాల్వాయి కుటుంబానికి అవకాశం ఇచ్చారు. ఈ కొత్త ఏడాదిలో సిర్పూర్ నియోజకవర్గంలో పెండింగ్ పనులు చేయడానికి ప్రాధాన్యత ఇస్తాం. ప్రజల సంక్షేమం, ఆకాంక్షల కోసం పని చేస్తాం. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేయడంతోపాటు 'పోడు' సమస్యకు శాశ్వత పరిష్కారం, పెండింగ్ ఇరిగేషన్ పనులు, వంతెనలు, రోడ్లు పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

– పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్యే, సిర్పూర్

పరిశ్రమలు రావాలి.. ఉపాధి పెరగాలి



ఆసిఫాబాద్: కొత్త సంవత్సరంలో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో వంతెనల నిర్మాణంపై దృష్టి సారిస్తాం. ముఖ్యంగా గుండి వాగుపై బ్రిడ్జి నిర్మాణంతోపాటు లక్మాపూర్, అనార్‌పల్లి వంతెనలు పూర్తి చేస్తాం. మారుమూల గ్రామాల్లో సౌకర్యాలు కల్పిస్తాం. లింగాపూర్, గాదిగూడ మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాలు, విద్య, వైద్యం మెరుగుపరుస్తా. కొత్త సంవత్సరంలో జిల్లాకు మరిన్ని పరిశ్రమలు రావాలి.. యువతకు ఉపాధి పెరగాలి.

– కోవ లక్ష్మి, ఎమ్మెల్యే, ఆసిఫాబాద్

కొత్త ఏడాదిలో ట్రైనింగ్‌కు..



రెబ్బెన: గ్రూప్- 1 సాధించడమే లక్ష్యంగా ప్రిపేర్ అవుతున్న సమయంలో ఎస్సై నోటిఫికేషన్ వచ్చింది. కష్టపడి చదివి ప్రిలిమినరీ, మెయిన్స్‌లో అర్హత సాధించా. ఫిజికల్ ఈవెంట్స్‌లోనూ మెరిట్ సాధించడంతో డిప్యూటీ జైలర్ పోస్టు సాధించాను. కాళేశ్వరం జోన్‌లో ఒకే పోస్టును సాధించడం 2023లో నేను సాధించిన అతిపెద్ద విజయం. గతంలో పంచాయతీ కార్యదర్శిగా, కానిస్టేబుల్‌గా పని చేశా. కొత్త ఏడాదిలో ఈ నెల 6 నుంచి డిప్యూటీ జైలర్ ట్రైనింగ్‌కు వెళ్తున్నా. డిప్యూటీ జైలర్‌గా పని చేస్తూనే అంతిమంగా గ్రూప్- 1 ఉద్యోగం సాధించడమే నా అంతిమ లక్ష్యం.

– సిరికొండ అజయ్ చారి, గోలేటి, మం.రెబ్బెన

గోలేటి ఓసీపీ ప్రారంభించడమే లక్ష్యం



రెబ్బెన: 2023 సంవత్సరం బెల్లంపల్లి ఏరియాకు కలిసొచ్చింది. గడిచిన 9 నెలల కాలంలో ఆశించిన స్థాయిలో బొగ్గు ఉత్పత్తి చేపట్టగలిగాం. ఉద్యోగులను క్వారీ లోపల పని చేసేలా ప్రోత్సహించడంతో నేడు వారు ఇన్సెంటివ్ పొందుతున్నారు. 2023లో లక్ష్యానికి అనుగుణంగా ఏరియాను ముందుకు తీసుకెళ్లాం. ఇక 2024లో గోలేటి ఓసీపీని ప్రారంభించడమే ముందున్న ప్రధాన లక్ష్యం. సోనాపూర్ గ్రామస్తులు సహకరిస్తే గోలేటి నర్సరీ సమీపంలో నాణ్యతతో కూడిన పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నాం.

– రవిప్రసాద్, జనరల్ మేనేజర్, బెల్లంపల్లి ఏరియా

విద్యావిధానంలో మార్పులు రావాలి



కెరమెరి: గడిచిన ఏడాదిలో ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ఒత్తిడి బాగా పెరిగింది. విద్యా విధానంలో మరిన్ని మార్పులు రావాలి. బోధన మినహా ఇతర పనులు అప్పగించకుండా చూడాలి. అప్పుడే విద్యార్థులకు న్యాయం చేయగలం.

– అయితి సాగర్, హెచ్‌ఎం, దేవుడ్‌పల్లి

రాములోరి శోభాయాత్ర



కోలాటం ఆడుతున్న మహిళలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రం శ్రీరామ నామ స్మరణతో మార్మోగింది. అయోధ్యలో ఈ నెల 22న రామాలయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలో జన్కాపూర్ రామాలయం నుంచి రాముడి విగ్రహం, అయోధ్య అక్షింతలతో నిర్వహించిన శోభాయాత్ర కనుల పండువగా సాగింది. ఆలయంలోని దేవతామూర్తులు, అక్షింతలకు ముందుగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సంయోజక్ ఆంజనేయులు, అజ్మీరా శ్యాంనాయక్, సతీశ్‌బాబు పూజలు చేశారు. ఎనిమిది మంది కరసేవకులు దండానాయకుల చంద్రకాంత్, కృష్ణమూర్తి, అనిల్, వేణుగోపాల్, సంతోష్‌ను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే శోభాయాత్రను ప్రారంభించగా.. డీజే చప్పుళ్లు, మహిళల కోలాటంతో జోరుగా సాగింది. యువకులు జైశ్రీరాం నినాదాలతో హోరెత్తించారు. అంబేద్కర్ చౌక్, చెక్‌పోస్టు, కన్యకా పరమేశ్వరి ఆలయం, కంచుకోట, బ్రాహ్మణవాడ, రావులవాడ, వివేకానందచౌక్ మీదుగా జన్కాపూర్ ఆలయం వరకు యాత్ర సాగింది. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు గుండేటి కోటేశ్వర్‌రావు, మధుకర్, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



అక్షింతలతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, తదితరులు



జిల్లా కేంద్రంలో భక్తుల శోభాయాత్ర

పరిహారంతో భరోసా!

సహజ అటవీ సంపద తరిగిపోవడంతో వన్యప్రాణులు గ్రామాల్లోకి వస్తున్నాయి. పంటలను ధ్వంసం చేస్తున్నాయి. విత్తనం వేసిన నాటి నుంచి పంట చేతికొచ్చే వరకు రైతులు పగలు, రాత్రి తేడా లేకుండా కాపలా కాస్తున్నారు. అయినా ఏ అర్ధరాత్రి పూటో వచ్చే జంతువులు పంటను ధ్వంసం చేస్తున్నాయి. అన్నదాతలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం పరిహారం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.


- వన్యప్రాణుల దాడితో వేల ఎకరాల్లో పంటలు ధ్వంసం
- మనుషులపైనా దాడులకు దిగుతున్న పెద్ద పులులు, అడవి పందులు
- పరిహారం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు



వన్యప్రాణి దాడిలో గాయపడిన రైతు (ఫైల్)

పరిహారం ఇలా..

సందర్భం	గతంలో	తాజాగా
మనిషి మరణం	రూ.5 లక్షలు	రూ.10 లక్షలు
తీవ్ర గాయాలు	రూ.75 వేలు	రూ.లక్ష
పంట నష్టం(ఎకరానికి)	రూ.6,000	రూ.7,500
పశువు మరణం	రూ.20,000	రూ.50,000 మించకుండా



కౌటాల(సిర్పూర్): జిల్లాలోని 15 మండలాల పరిధిలో చాలా గ్రామాలు పంట చేలు దట్టమైన అడవులను ఆనుకుని ఉంటాయి. ఇక్కడి ప్రజలు వన్యప్రాణులతోనే సహవాసం చేస్తారు. అడవి పందులు, ఎలుగుబంట్ల దాడుల్లో పనులకు వెళ్లిన రైతులు, కూలీలు విగతజీవులుగా మారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మరికొంత మంది క్షతగాత్రులుగా మారి ఉపాధి దొరక్క జీవనం భారమవుతోంది. అలాంటి బడుగు జీవులకు కనీసం అటవీశాఖ నుంచి పరిహారం సైతం అందడం లేదు. వన్యప్రాణుల దాడుల్లో మరణించి వారితోపాటు, తీవ్ర, స్వల్ప గాయాలైన వ్యక్తులు కాళ్లు, చేతులు పోగొట్టుకుని జీవితాంతం బాధపడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పోడు భూముల్లో పంట నష్టం, మనుషులపై దాడులు జరిగితే కనీసం కేసులు కూడా నమోదు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

గుంపులుగా దాడులు..

జిల్లా వ్యాప్తంగా జూలై నుంచి డిసెంబర్ మధ్యే ఎక్కువగా అడవి జంతువులు మనుషులు, పంటలపై దాడులకు దిగుతున్నాయి. అన్ని మండలాల్లో 2,445 చ.కి. మీటర్లలో అడవులు విస్తరించి ఉండగా.. 1,100 గ్రామాలు అడవుల మధ్యే ఉన్నా యి. ముఖ్యంగా కాగజ్‌నగర్ డివిజన్‌లో పులి దాడులు ఉన్నాయి. అడవి పందులు, ఎలుగుబంట్లు మనుషులపై దాడి చేస్తున్నాయి. అలాగే ఏటా వేల ఎకరాల్లో పంటలను ధ్వంసం చేస్తున్నాయి. బెజ్జూర్, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, కౌటాల, దహెగాం, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), తిర్యాణి, కెరమెరి, నార్నూర్, లింగాపూర్ ప్రాంతాల్లో అడవి పందుల దాడులు అధికంగా ఉన్నాయి. పంటల రక్షణకు రైతులు పడరాని పాట్లు పడుతుండగా.. కొంత మంది విద్యుత్ తీగలతో వన్యప్రాణులను హతమారుస్తున్నారు. ఇలాంటి వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

పరిహారం పెంపు..

వన్యప్రాణుల దాడులతో నష్టపోయిన వారికి ఇచ్చే పరిహారాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో పరిహారానికి సంబంధించి ఉత్తర్వులు ఉన్నా కొద్దిమంది మాత్రమే నగదు అందేది. రెండేళ్లుగా పంట నష్ట పరిహారానికి సంబంధించి అసలు దరఖాస్తులే తీసుకోలేదు. నూతన ప్రభుత్వం వన్యప్రాణులతో జరిగే నష్టానికి పరిహారం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడంతో రైతులకు కొంత మేలు జరగనుంది. అడవి పందుల దాడులతో జరిగిన నష్టానికి పరిహారం రావాలంటే.. దరఖాస్తు చేసుకున్న రైతు పంట పొలాన్ని అటవీ అధికారులు సందర్శించి నష్టం అంచనా వేయాల్సి ఉంటుంది. అయితే సకాలంలో వారు రాకపోవడంతో పరిహారంపై అన్నదాతలు ఆసక్తి చూపడం లేదు. దరఖాస్తు సమయంలోనే రెవెన్యూ, వ్యవసాయ, అటవీశాఖల నివేదికలు జత చేసి పంపిస్తున్నా.. విచారణ పేరిట నెలల తరబడి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఎంత మందికి పరిహారం మంజూరైందనే సమాచారం కూడా సంబంధిత అధికారుల వద్ద ఉండటం లేదు. ఘటన జరిగిన రెండు రోజుల్లో సంబంధిత రేంజ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. వ్యవసాయాధికారి, రెవెన్యూ, అటవీ శాఖాధికారులు సంయుక్తంగా ఘటన స్థలికి వెళ్లి నష్టాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు పంపిస్తారు. వారు విచారణ అనంతరం బాధితులకు పరిహారం మంజూరు చేస్తారు.

నష్టం జరిగితే ఫిర్యాదు చేయాలి

వన్యప్రాణుల్లో దాడులు మృతి చెందిన అందించే పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. ఇందుకు సంబంధించి అటవీశాఖకు ఆదేశాలు వచ్చాయి. ఈ ఏడాది కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో వన్యప్రాణుల దాడుల్లో ముగ్గురికి గాయాలు అయ్యాయి. వారిలో ఒకరు చనిపోయారు. వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. నిధులు రాగానే బాధిత కుటుంబాలకు అందిస్తాం. వన్యప్రాణుల దాడుల్లో ఎలాంటి నష్టం జరిగినా అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలి.

– టి.వేణుబాబు, డీఎఫ్‌వో, కాగజ్‌నగర్

నిబంధనలు..

- అడవులు, రక్షిత ప్రాంతాల్లో వలస పశువులు, మేకలు, గొర్రెలు చనిపోతే పరిహారం అందదు.
- జాతీయ పార్కుల్లో జరిగిన దాడుల్లో పశువులు చనిపోతే పరిహారం చెల్లించరు.
- ఫారెస్ట్ బీట్ ఆఫీసర్/ఎఫ్‌ఎస్‌వో పరిశీలించే వరకు దాడిలో పశువుల కళేబరాలను చనిపోయిన ప్రాంతం నుంచి తరలించొద్దు.
- పశువుల మృత్యువాతపై ఎఫ్‌ఎస్‌వో.. ఆపై స్థాయి అధికారి సర్టిఫికెట్(పంచనామా, ఫొటోలతో సహా) ఇవ్వాల్సి ఉంటుంది.
- డీఎఫ్‌వో/ఎఫ్‌డీఓలు పరిహారం మంజూరు చేసి చెక్కుల ద్వారా చెల్లించాలి.
- వన్యప్రాణుల దాడుల్లో మనుషుల మరణం లేదా గాయపడినప్పుడు(పాములు, కోతులు మినహా) దాడి జరిగిన ప్రాంతాన్ని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లేదా ఎస్సై హోదా కలిగిన ఉద్యోగి 48 గంటల్లో పరిశీలించారు.
- మృతికి కారణంపై అసిస్టెంట్ సివిల్ సర్జన్‌తో పోస్ట్‌మార్టం నిర్వహించి సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది.

హైమన్ డార్ఫ్ వర్ధంతికి ఆహ్వానం

జైనూర్: ఆదివాసీల ఆత్మ బంధువు ప్రొ.హైమన్ డార్ఫ్ వర్ధంతి సభకు హాజరు కావాలని కోరుతూ ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌కి కమిటీ సభ్యులు, మార్లవాయి గ్రామస్తులు ఆహ్వానం అందించారు. ఆదివారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయంలో పీవోతో కలిసి వర్ధంతి కరపత్రాలు ఆవిష్కరించారు. జైనూర్ మండలం మార్లవాయిలో ఈ నెల 11న హైమన్ డార్ఫ్ వర్ధంతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ దాసరి శ్రీనివాస్, లేబర్ కమిషన్ రిటైర్డ్ అధికారి హెచ్‌కే నాగు, ఏపీవో ఆత్రం భాస్కర్, జైవంత్‌రావు, మడావి రాజు, ఆత్రం సుగుణక్క పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కాగజ్‌నగర్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్వతి సత్యనారాయణ అన్నారు. జిల్లా అధ్యక్షుడు తొటం శ్యాంసుందర్ అధ్యక్షతన ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని సంఘ భవనంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీసు రూల్స్ లేకపోవడంతో దశాబ్దాలుగా ఉపాధ్యాయులు పదోన్నతులకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి సర్వీసు రూల్స్ రూపొందించాలని డిమాండ్ చేశారు. జీవో 32 ప్రకారం నెలవారి పదోన్నతులు మళ్లీ పునరుద్ధరించి వేసవి సెలవుల్లో బదిలీల క్యాలెండర్ రూపొందించాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు జీవో 57 అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధికి 'పీఎం జన్‌మన్'



కార్డులు ఆవిష్కరిస్తున్న డీటీడీవో, తదితరులు

ఆసిఫాబాద్‌రూరల్: ఆదివాసీల సమగ్ర అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్(పీఎం జన్‌మన్)ను అందుబాటులోకి తెచ్చిందని డీటీడీవో రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పీఎంఆర్సీ కార్యాలయంలో పథకానికి సంబంధించి కార్డులను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం రవిచంద్ర కాలనీలో గిరిజనులకు పథకంపై అవగాహన కల్పించారు. డీటీడీవో మాట్లాడుతూ జిల్లాలో కొలాం, తోటి ఆదిమ గిరిజన తెగల 149 హ్యాబిటేషన్లను గుర్తించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో వైద్యం, విద్య, విద్యుత్, గృహ, రహదారి, తాగునీరు, జనాభా నిష్పత్తి ప్రకారం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, సంక్షేమ పథకం ద్వారా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీఎం శకుంతల, ఏటీడీవోలు క్షేత్రయ్య, పురుషోత్తం, డీఎస్‌వో మీనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనం బోల్తా.. ఒకరు మృతి

తిర్యాణి: అదుపు తప్పి బోలేరో(మాక్స్) వాహనం బోల్తా పడిన సంఘటనలో హమాలీ మృతిచెందారు. స్థానికుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన దాసరి భూమయ్య (45) హమాలీ కూలీగా పనులు చేస్తూ జీవిస్తున్నాడు. అందులో భాగంగా ఆదివారం స్థానిక బోలేరో వాహనంపై పత్తి నింపేందుకు మండలంలోని కన్నెపెల్లి గ్రామానికి కూలీగా వెళ్లాడు. అక్కడ పత్తి నిల్వ లేకపోవడంతో సాయంత్రం తిరిగి వస్తుండగా గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఆ క్రమంలో అందులో ప్రయాణిస్తున్న భూమయ్యకు తీవ్ర గాయాలు కాగా, డ్రైవర్ మల్లేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే భూమయ్యను మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తలకు తీవ్ర గాయం కావడంతో అప్పటికే మృతి చెందినట్లు పీహెచ్‌సీ వైద్యుడు హర్షవర్ధన్ తెలిపారు.

గేదెల మందను ఢీకొన్న లారీ

జైపూర్: లారీ డ్రైవర్ అజాగ్రత్తతో నడపడంతో నాలుగు గేదెలు మృత్యువాతపడ్డాయి. జైపూర్ మండలం ఇందారం రాజీవ్ రహదారిపై ఆదివారం ఉదయం మేకల సత్యనారాయణ, మేకల తిరుపతికి చెందిన గేదెలు పెద్ద చెరువుపై వెళ్తుండగా శ్రీరాంపూర్ నుంచి బసంతనగర్‌కు వెళ్తున్న యాష్ ట్యాంకర్ లారీ గేదెల మందను ఢీకొట్టడంతో నాలుగు గేదెలను మృతి చెందాయి. వాటివిలువ రూ.3లక్షల వరకు ఉంటుందని బాధితులన్నారు.

ఆసరా కల్పించాలని..

కెరమెరి: గత సంవత్సరం పర్వాలేదనిపించింది. వ్యాపారం బాగానే సాగింది. కానీ తాను అనుకున్నంత యువతకు ఉద్యోగావకాశాలు కల్పించలేకపోయాను. గతేడాది ఏడుగురికి సీడ్స్, ఫర్టిలైజర్స్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించాను. 2024లో ఆ వెలితి లేకుండా చేస్తాను. మరో పది మంది వరకు చదువుకున్న యువకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాను. నూతన ఏడాది అందరూ సంతోషంగా ఉండాలి.

– గిత్తే తిరుపతి, వ్యాపారి, సీడ్స్ అండ్ ఫర్టిలైజర్స్, కెరమెరి

ఉత్తమ ఫలితాల కోసం..

మంచిర్యాలఅర్బన్: గతేడాది ఇంటర్‌లో 82శాతం మేర ఫలితాలు సాధించాం. ఈ ఏడాది జరిగే ఇంటర్‌లో ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాలు బోధించి ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాం. నూటికి నూరు శాతం ఫలితాలు సాధించేలా ముందుకు సాగుతున్నాం. ప్రస్తుతం కళాశాలల్లో ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. రానున్న పరీక్షలకు భయాందోళన వీడి విద్యార్థులు సన్నద్ధం కావాలి.

– శైలజ, డీఐఈవో, మంచిర్యాల

కొత్త ఆలోచనతో..

గడిచిన ఏడాదికి బైబై చెబుతూ... నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. కొత్త ఏడాదిలో జీవితాన్ని నూతనంగా ప్రారంభించేందుకు సంసిద్ధమయ్యారు. పలువురు ప్రణాళిక పరంగా 2024లో ముందుకు సాగాలని, మరికొందరు 2023లో జరిగిన పొరపాట్లను మళ్లీ పునరావృత్తం కాకుండా చూసుకోవాలని కోరుకుంటున్నారు. ఈ కొత్త ఏడాది.. జీవితం కొత్తగా సాగాలని పలువురు కోరుతున్నారు. వారి అభిప్రాయాలు ఈ కింది విధంగా.. – సాక్షి నెట్‌వర్క్

ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తా

బెల్లంపల్లి: నూతన సంవత్సరంలో లక్ష్యాన్ని ఎంచుకుని ప్రతి ఒక్కరూ ఆ ఏడాదంతా అందుకు తగిన విధంగా వ్యవహరించడం జరుగుతుంది. అదే విధంగా నేను కూడా ఈ నూతన సంవత్సరాన్నీ పురస్కరించుకుని సరి కొత్త నిర్ణయం తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నాను. డబ్బులను జల్సాలకు ఖర్చు చేయకుండా ఆర్థిక క్రమ శిక్షణను పాటించాలని అనుకుంటున్నాను.

– తరుణ్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, బెల్లంపల్లి

పుస్తక పఠనం చేస్తా..

మంచిరాల్యక్రైం: ఈ నూతన సంవత్సరంలో మంచి 15న వలలు చదువాలని నిర్ణయం చేసుకున్న. గతేడాదిలో ఒక్కసారి 'చివరికి మిగిలేది' అనే నవల చదివాను. కొన్ని కారణాలతో ఆగిపోయింది. ఈ ఏడాదిలో బుక్ షాపింగ్ చేసి గోపిచంద్ రచించిన నవల 'ఆ సముద్రుడి జీవిత యాత్ర', కొరవగంటి కుటుంబరావ్ రచించిన నవల 'చదువు' బుచ్చిబాబు రచించిన నవల 'చివరికి మిగిలేది' చలం, గురిజాడ నవలలు చదువాలని తీర్మానం చేసుకున్న. అలాగే ఆన్‌లైన్ పాఠాలు చేసి తిరుపతి పేరుమీద యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేసి ఎకనామిక్స్ సబ్జెక్ట్‌ను అప్‌లోడ్‌చేస్తా.

– భూక్యా తిరుపతి, ఎన్‌సీసీ అధికారి, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, మంచిర్యాల

ఉద్యానపంటల సాగు

పెంచికల్‌పేట్: గత ఏడాది రెండు ఎకరాల్లో పత్తి పంట సాగుచేశాను. వర్షాభావ పరిస్థితులతో దిగుబడి తగ్గి అప్పుల పాలయ్యాను. ఈ సంవత్సరం సంప్రదాయ పంటల సాగుకు స్వస్తి పలికి ఉద్యానవన పంటల సాగు ప్రారంభించాలనుకుంటున్న. నూతన సంవత్సరం మంచి లాభాలు సాధిస్తాను.

– పందిర్ల ప్రమోద్, యువ రైతు, కొండపల్లి

ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం

పెంచికల్‌పేట్: నూతన ఏడాది ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక సమయాన్ని కేటాయించాలని నిర్ణయం తీసుకున్న. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రతిరోజు ఉదయం వాకింగ్ వెళ్లాలని నిర్ణయంచుకున్న. నాతో పాటు మరింత మంది యువకులు వ్యాయామం చేసేలా ప్రోత్సహిస్తా..

– పాలె సుధాకర్, ఎల్లూర్

ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా

కౌటాల: గతేడాది ప్రభుత్వ ఉద్యోగం కోసం పలు పోటీ పరీక్షలు రాసిన పేపర్లు లీక్ కావడంతో నిరాశే మిగిలింది. ఈ నూతన సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడానికి ప్రత్యేక ప్రణాళిక కలిగి ప్రిపేర్ అవుతాను. ప్రభుత్వ ఉద్యోగం కోసం గత కొన్ని నెలలుగా సిద్ధ పడుతున్నాను. కొత్త ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కృషి చేయాలి. యువత ప్రత్యేక లక్ష్యం కలిగి ఉండి దానిని సాధించాలి.

– కె.సువర్ణ, యువతి, కౌటాల

డైరీ రాయడం అలవాటుగా..

బెల్లంపల్లి: గత కొన్నేళ్ల నుంచి రోజువారీగా డైరీ రాయడం నాకు అలవాటు. ప్రతి సంవత్సరం కొత్త ఏడాది తొలిరోజు నుంచి రోజువారీ దినసరి చ ర్యను డైరీలో రాయడం అలవాటైంది. ఆ అలవాటు ఉద్యోగ రీత్యా నాకు ఎంతగానో ఉపయోగ పడుతోంది. ఉన్నతాధికారులు చెప్పే విషయాలను డైరీలో రాసుకుని అందుకు అనుగుణంగా వ్యవహరించడం , సమయానుకూలంగా ఆ పనులు చక్కబెట్టడం చేస్తున్నాను.

– ఆర్.భుజంగరావు , మున్సిపల్ కమిషనర్,బెల్లంపల్లి

రైతులకు మరిన్ని సేవలు

పెంచికల్‌పేట్: గతేడాది ఇంటి వద్దే సోలార్ బ్యాటరీల విక్రయ దుకాణం ప్రారంభించారు. గత సంవత్సరం వ్యాపారం బాగుంది.. లాభాలు వస్తున్నాయి. రైతుల పంట పొలాల వద్దకు వెళ్లి సేవలందిస్తున్న. ఈ ఏడాది కొత్త దుకాణం ప్రారంభించి రైతులకు మరింత సేవలు అందిస్తా.

– లోన్కురి రాకేశ్, ఎల్కపల్లి, పెంచికల్‌పేట్

అధిక దిగుబడులు సాధిస్తా

ఈ ఏడాది మూడు ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశాను. వాతావరణంలో మార్పుల కారణంగా పంటకు పలు తెగుళ్ల సోకాయి. ఈ నూతన ఏడాది ఐదు ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తా. పంట మార్పిడి చేసి నూతన పద్ధతుల్లో పంటలు సాగు చేసి ఆర్థికంగా వృద్ధి సాధిస్తాను. యువ రైతులు పంటల సాగులో నూతన పద్ధతులు పాటించాలి.

– డి.రాంప్రసాద్, యువ రైతు, గుండాయిపేట్

పనులు సవ్యంగా జరగాలి..

కెరమెరి: గతేడాది కొంత ఒడిదుడుకుల మధ్య కొనసాగిన ప్పటికీ 2024 సంవత్సరంలో పనులన్నీ సవ్యగా జరగాలని కోరుతున్నా. ఆయురారోగ్యంతో పాటు కోరిన కోరికలు నెరవేరాలి. జీవితంలో మరింత ఎదగాలి. ఆ భగవంతుడు ఆ శక్తిని కలిగించాలి. ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలి. ఈ సంవత్సరం అందరికి శుభం జరగాలి. ఉన్నతి పొందాలి.

– వై అశ్విని, ఎంఐఎస్–కో ఆర్డినేటర్, ఎంఆర్‌సీ

జాతీయ క్రీడాల్లో రాణిస్తా

గతేడాది రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపా. రెండేళ్లగా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణిస్తున్నా. నూతన సంవత్సరంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చడమే నా ముందున్న లక్ష్యం. ఉన్నత చదువు పూర్తి కాగానే క్రీడా కోటాలో సేవీలో ఉద్యోగం సాధించాలి. – సీహెచ్ రాజేశ్, క్రీడాకారుడు, యాపలగూడ

'గ్రూప్స్' సాధించడమే లక్ష్యం

రెబ్బెన: గడిచిన సంవత్సరంలో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికవ్వడం చెప్పలేని సంతోషాన్ని ఇచ్చింది. ప్రసుత్తం సర్టిఫికెషన్ వెరిఫికేషన్ పూర్తి కాగా మెడికల్ టెస్ట్ పెండింగ్ ఉంది. 2021 నుంచి కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు సిద్ధమవుతుండగా 2023లో అనుకున్న విధంగా కానిస్టేబుల్‌గా ఎంపిక కావడంతో కల నెరవేరింది.2024లో గ్రూప్స్ ఉద్యోగం సాధించడానికి కష్టపడతా. కొత్త ఏడాదిలో ప్రిపరేషన్ మొదలు పెడతా. కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడంతో ఆత్మవిశ్వాసం పెరిగింది. 2024లో గ్రూప్స్ కల సాకారం చేసుకుంటాననే నమ్మకం ఏర్పడింది. – సుల్వ కల్పన, కానిస్టేబుల్ అభ్యర్థి, గోలేటి

నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గంగాధర్

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ నాల్గో తరగతి కేంద్ర ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొండూరి గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. హైదరాబాద్‌లోని సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో గంగాధర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ అసోసియేషన్ సహ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు నియామక పత్రం అందజేశారు. ఆయన ఎన్నికపై సంఘం జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి సేవిస్తున్న నలుగురి అరెస్ట్

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గోలేటి ఎక్స్ రోడ్ సమీపంలోని గోల్డెన్ సిటీ వెంచర్‌లో గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను రెబ్బెన పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ అల్లం నరేందర్ వివరాలు వెలడించారు. గోలేటి ఎక్స్ రోడ్ సమీపంలో యువకులు గంజాయి సేవిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై చంద్రశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ వి.రాము, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, ఈశ్వర్‌సింగ్‌లతో సంఘటన స్థలానికి చేరుకోగా నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అందులో తిర్యాణి మండలం రోంపల్లికి చెందిన రాయిసెడం చక్రవతి, పెందూర్ సిద్ధార్థతో పాటు గోలేటికి చెందిన షేక్ ఆరీఫ్, దుర్గం చైతన్యలు ఉన్నట్లు తెలిపారు. గత ఏడాది కాలంగా యువకులు గంజాయికి అలవాటు పడి సేవిస్తున్నట్లు పేర్కొన్నారు. గంజాయి ఎక్కడి నుంచి సరఫరా అయిందనే విషయంపై విచారణ చేయగా తిర్యాణి మండలం గుడిపేట్‌కు చెందిన గణపతి పటేల్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్లు తేలిందన్నారు. వారివద్ద 5 గ్రాముల చొప్పున పది ప్యాకెట్లలో 50గ్రాముల గంజాయి లభ్యమైందని, దాని విలువ రూ.1250 ఉంటుందని తెలిపారు. యువకులను పోలీస్‌స్టేషన్‌ను తరలించి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో గంజాయిని సమూలంగా అరికట్టేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై చంద్రశేఖర్, కానిస్టేబుల్లు శ్రీనివాస్‌రెడ్డి, శ్రావణ్‌లు పాల్గొన్నారు.